ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

గురువారం 22 ఆగస్టు 2024



స్యాండ్ టాక్సీ మాకొద్దు..

- నీరుకుల్ల, గట్టెపల్లిలో ఇసుక రీచుల ఏర్పాటు
- వ్యతిరేకించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ట్రాక్టర్ల యజమానులు
- అక్రమ రవాణా చేయబోమని కలెక్టర్‌కు ట్రాక్టర్ యజమానుల తరపున లేఖ
- పెద్దపల్లి నియోజకవర్గంలో రీచులకు తాత్కాలికంగా బ్రేకులు..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటే నలభై ఎనిమిది గంటల్లో తమ ఇంటి వద్దకే ఇసుక సరఫరా చేసేందుకు జిల్లాలో స్యాండ్ ట్యాక్సీ విధానాన్ని అమలుచేస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ట్రాక్టర్ల యజమానులు ఈ విధానం తమకు వద్దంటూ వ్యతిరేకిస్తున్నారు. దీంతో సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, గట్టెపల్లిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచులు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. స్థానిక అవసరాలకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలంటున్నారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంతో పాటు తద్వారా అయ్యే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లాకు తొలి కలెక్టర్‌గా వచ్చిన ఆళగు వర్షిణి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్యాండ్ ట్యాక్సీ విధానానికి రూపకల్పన చేశారు. జిల్లాలోని మానేరు, గోదావరి, మోయతుమ్మెద వాగులపై ఇసుక రీచులను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇసుక కావాల్సిన వారికి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం స్యాండ్ ట్యాక్సీ ద్వారా ఇసుక రవాణా చేసేందుకు ట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చారు. వాటిపై ప్రత్యేకించి స్యాండ్ ట్యాక్సీ అని ముద్రించారు. వాటికి జీపీఆర్ సిస్టం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుకింగ్ చేసుకున్న తర్వాత ఆయా ఇసుక రీచుల నుంచి 48 గంటల్లో ఇంటి ముంగిటకు ఇసుక సరఫరా చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడింది. ఈ విధానాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయా జిల్లాల్లోనూ అమలుచేసింది. రెండేళ్ల క్రితం మానేరు నదిపై టీఎస్ఎండీసీ కమర్షియల్ ఇసుక రీచులను ఏర్పాటు చేసి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించింది. ఈ క్రమంలో గత ఏడాది కాలంగా స్యాండ్ ట్యాక్సీ రీచులకు ప్రాధాన్యం లేకుండాపోయింది. స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానులు మానేరు నుంచి ఇసుకను తోడుకుని వెళ్లి విక్రయించుకుని ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో లారీల్లో హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలింది. పర్యావరణ అనుమతులు లేకుండానే కమర్షియల్ ఇసుక క్వారీలను మూసివేయాలని చెన్నై ఎన్‌జీటీ కోర్టులో పలువురు పిటిషన్ దాఖలు చేశారు. వాటిని పరిశీలించిన ఎన్జీటీ కోర్టు రీచులను మూసివేయాలని ఆదేశించడంతో ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాత మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగింది. నెల 15 రోజుల క్రితం జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష మానేరు నదిపై మూతపడిన స్యాండ్ ట్యాక్సీని తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు చేశారు. మొదట ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో ఒక రీచును, ఆ తర్వాత మంథని మండలం విలోచవరంలో మరొక రీచును ప్రారంభించారు. అప్పటి వరకు గోదావరి నదిపై గోలివాడ వద్ద ఇసుక రీచ్ కొనసాగుతున్నది.

● అక్రమ రవాణాను అరికట్టేందుకు..

పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, గట్టెపల్లిలో ఇసుక రీచులు ఏర్పాటు చేసి ఆ తర్వాత ఓదెల, కాల్వశ్రీరాంపూర్ పరిధిలో మరికొన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రంగం సిద్ధం చేయగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వ్యతిరేకిస్తూ వచ్చారు. ఆర్డీవో గంగయ్య స్వయంగా ఎమ్మెల్యేను కలిసి స్యాండ్ ట్యాక్సీ నడిచేందుకు సహకరించాలని కోరినా కూడా ఆయన ససేమిరా అన్నారు. దీంతో వేచిచూసిన అధికారులు సుల్తానాబాద్ మండలంలో పలుచోట్ల అక్రమంగా ఇసుక డంపులను ఏర్పాటుచేసి లారీల్లో హైదరాబాద్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికార యంత్రాంగం లారీలను పట్టుకుని కేసులు పెట్టారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు విధించే జరిమానాలను కూడా రెండు, మూడింతలు పెంచారు. అక్రమ రవాణా ఆగడం లేదని గమనించిన కలెక్టర్ ఇటీవల నీరుకుల్ల, గట్టెపల్లి ఇసుక రీచుల ఇసుక కావాల్సిన వాళ్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారు. స్యాండ్ ట్యాక్సీ విధానంలో ఉన్న ధరల కంటే కాస్త తగ్గించారు. ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుక సుల్తానాబాద్‌కు 1100 రూపాయలు, పెద్దపల్లికి 1750 రూపాయలు, ఎలిగేడు మండలానికి 1750 రూపాయలు, జూలపల్లికి 2100 రూపాయలు, అప్పన్నపేటకు 1900 రూపాయలు, రాఘవాపూర్, సబితంకు 2100 రూపాయలకు సరఫరా చేస్తామని ప్రకటించారు. స్యాండ్ ట్యాక్సీ ధరల ప్రకారం 5 కిలోమీటర్ల వరకు 1160 రూపాయలు, 10 కిలోమీటర్ల వరకు 1550 రూపాయలు, 15 కిలోమీటర్ల వరకు 1940 రూపాయలు, 20 కిలోమీటర్ల వరకు 2330 రూపాయలు, 25 కిలోమీటర్ల వరకు 2720 రూపాయలు, 30 కిలోమీటర్ల వరకు 3,110 రూపాయలు, 35 కిలోమీటర్ల వరకు 3,500 రూపాయలు, 40 కిలోమీటర్ల వరకు 3,840 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ధరలు తగ్గించినా కూడా నీరుకుల్ల, గట్టెపల్లి రీచుల ఇసుక కోసం ఎవరు కూడా ఇసుక కోసం బుకింగ్ చేసుకోలేదు. స్యాండ్ ట్యాక్సీ విధానం వల్ల తక్కువ ధరకు ఇసుక పోయడం లేదని, ప్రజలపై భారం పడుతున్నదని, స్థానిక అవసరాలకు ఉచితంగానే ఇసుక సరఫరా చేయాలని మరోసారి కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకవెళ్లారు. బుధవారం సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే మానేరు పరివాహక ప్రాంతాల ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుక రవాణా చేయాలని, అక్రమంగా డంపులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణా చేయబోమని ఇసుక ట్రాక్టర్ల యజమానుల తరపున కలెక్టర్, ఆర్డీవోకు ఎమ్మెల్యే లేఖ అందజేశారు. దీంతో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో తాత్కాలికంగా స్యాండ్ ట్యాక్సీ ఇసుక రీచులకు బ్రేకులు పడినట్లే.



ఆర్డీవోకు లేఖ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

రుణ మాఫీపై బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం

-మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, ఆగస్టు 21: రుణ మాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన రైతులకు రుణ మాఫీ చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 5 బెడ్ల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం స్థానిక గాంధీచౌక్‌లో స్వచ్ఛఆటోలు, మున్సిపల్ అభివృద్ధి పనులు, మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కులను మంత్రి శ్రీధర్‌బాబు ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో రుణ మాఫీ పొందిన బీఆర్ఎస్ నేతల లెక్కలు తీస్తాన్నారు. రుణ మాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన రైతులకు రుణ మాఫీ చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసే విధంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదకు 250యూనిట్ల విద్యుత్ సరఫరా, రూ.500 లకు సబ్సిడీ గ్యాస్ పథకాలను అమలుచేశామన్నారు. వచ్చే ఐదేళ్లలో మహిళలకు లక్షల కోట్ల బ్యాంక్‌రుణాలు అందజేసి మహిళలచే పలు వ్యాపార, వాణిజ్య యూనిట్ల స్థాపన కోసం కృషిచేస్తామన్నారు. గతంలో తాము మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందజేశామన్నారు. మంథ ని ప్రాంతంలో 40 లక్షల వ్యయంతో 25 మహిళా సంఘాలచే మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 165 మహిళా సంఘా లకు రూ. 20 లక్షల 67 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేస్తున్నామని, వీటిని సద్విని యోగం చేసుకొని వ్యాపార రంగంలో మహి ళలు ఎదగాలన్నారు. అభివృద్ధిలో మంథని పట్టణాన్ని ఆదర్శంగా తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.13.95 లక్షల నిధులతో ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మి స్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ నూతన భవనం, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం పలు అభివృద్ధి పనులకు చేపట్టబో తున్నట్లు తెలిపారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకం ద్వారా సంఘాలకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు వ్యాపారంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ఆర్డీవో హనుమా నాయక్, వివిధ శాఖ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నేడు నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదాపై చర్చ

పెద్దపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై ఈనెల 22న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై జిల్లాలోని రైతు సంఘాలు,మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు(రిటైర్డ్‌సర్వీస్)లతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన సూచనలు, సలహాలు రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నివేదిస్తామని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్

గోదావరిఖని, ఆగస్టు 21: రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల రుణ మాఫీ చేయకుండా వారిని నట్టేట ముంచిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మె ల్యే కోరుకంటి చందర్ అన్నా రు. బుధవారం స్థానిక చౌర స్తా సమీపంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాం గ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి కేవలం 40శాతం మాత్రమే రుణ మాఫీ చేసి రైతులను మోసం చేసిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని చందర్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతు సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర రైతాంగం కూడా కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీయాలన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, గాదం విజయ, నాయకులు నారాయణదాసు మారుతి, అచ్చెవేణు, చల్లగురుగుల మొగిలి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, తోకల రమేష్, ఓదెలు, నట్టు శ్రీను, కిరణ్‌జీ, గుంపుల లక్ష్మి, రమాదేవి, వెంకటేష్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం..

కేసీఆర్ పాలనలో మాంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయంటూ బుధవారం స్థానిక చౌరస్తాలో కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, అచ్చె వేణు, చల్లగురుల మొగిలి, పిల్లి రమేష్, నారాయణదాసు మారుతి, చెలుకలపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, జక్కుల తిరుపతి, నీరటి శ్రీనివాస్, కౌటం బాబు, జిట్టవేని ప్రశాంత్ కుమార్, కిరణ్ జీ, పాలడుగుల కనకరాజ్, ఇరుగురాళ్ల శ్రావణ్, చింటూ, కొర్రి ఓదేలు, రమాదేవి, ముద్దసాని సంధ్యారెడ్డి, గుంపుల లక్ష్మి, మెట్ట లక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక అవసరాల కోసమే ఫ్రీ ఇసుక విధానం

- ఇసుక అక్రమ రవాణా అందరికీ ప్రమాదకరం - పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 21: పేదల ప్రజల సౌలభ్యం కోసం రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పెద్దపల్లి నియోజక వర్గంలో ఇసుక ఫ్రీ విధానాన్ని అమలు చేస్తున్నా మని, ఆ పేరుతో ఎక్కడా అక్రమంగా ఇసుక రవాణా చేయకూడదని ఎమ్మెల్యే విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్‌లో బుధవారం మానేరు పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన ఇసుక రవాణా చేసే డ్రైవర్లు, యజమానులతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంత పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల నిర్మాణం భారం కాకూడదని, స్థానిక అవసరాల కోసం ఇసుక ఫ్రీ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగని ట్రాక్టర్ డ్రైవర్లు యజమానులు ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేది లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి లారీల ద్వారా ఇసును హైదరాబాద్ వంటి నగరాలకు విచ్చల విడిగా తరలించి సొమ్ము చేసుకుందని విమర్శించారు. స్యాండ్ టాక్సీ విధానం ద్వారా ఎస్ఆర్‌వోలు ఇష్టానుసారంగా ఇసుక రవాణాకు అక్రమ అనుమతులు ఇచ్చి పెద్ద దందా నడిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సమస్యలు అన్ని అధిగమించి ప్రజలకు ఫ్రీ ఇసుకను ఇస్తామని, లారీల ద్వారా ఇసుక తరలింపును నిలిపివేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలిచన తర్వాత లారీలను కట్టడి చేశామని, ఫ్రీ ఇసుక అమలు చేస్తున్నామని అయితే కొంత మంది అతి ఆపేక్ష వల్ల లారీల ద్వారా ఇప్పటికీ ఇసుక తరలింపు జరుగుతుందని చెప్పారు. దీంతో ఫ్రీ ఇసుక విధానానికి అటంకాలు అడ్డంకులు వచ్చి మళ్లీ స్యాండ్ టాక్సీ విధానాన్ని అమలు చేసేందుకు కలెక్టర్ నిర్ణయించారని అన్నారు. అక్రమంగా ఇసుక డంప్‌లు ఏర్పాటుచేయడం, లారీల ద్వారా రవాణా చేయడం, రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా కూడా పెద్దఎత్తున ఇసుక తరలించడం వంటి చర్యల వలన జిల్లా కలెక్టర్ తీవ్రంగా పరిగణించారని వివరించారు. మరోక అవకాశం కోసం తాను కలెక్టర్‌ను కోరగా ఒప్పుకున్నారన్నారు. అయితే ట్రాక్టర్ యజమానుల తరపున అక్రమ రవాణా చేయబోమని బాధ్యత వహించి ఒక లెటర్ ఇవ్వాలని కలెక్టర్ కోరారని, దీనికి అంగీకరించి అందరి తరపును కలెక్టర్‌కు లెటర్ ఇస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు కలిసి సంతకాలు చేసిన లెటర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా సమావేశంలో పాల్గొన్న పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు అందజేశారు. ఇకపై ట్రాక్టర్ యజమానులు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలని అధికారులు సూచించారని దీన్ని ఖచ్చితంగా పాటించాలని, ఈ నిర్ణయాన్ని ఎవరు అతిక్రమించినా తాను చేసేదీ ఏమీ ఉండదని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు.

ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్‌డీవో గంగయ్య, సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారెడ్డి, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు : సీపీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 21: నేరాల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేరసమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరస్థులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులతో పాటు ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదు చేసిన కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ ఉన్న కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. విచారణ వెంటనే పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. నిందితులకు శిక్ష పడేవిధంగా విచారణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. శాస్త్రీయ పరిశోధన ద్వారా కేసులను సమగ్రంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని, విచారణలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. సమావేశంలో అడిషనల్ డీజీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, పెద్దపెల్లి సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల భూసేకరణ త్వరితగతిన పూర్తి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

పెద్దపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆమె రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి జాతీయ రహదారుల భూసేకరణపై మంచిర్యాల, వరంగల్, హనుమకొండ,పెద్దపల్లి ,రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సదరు భూమిని జాతీయ రహదారుల అథారిటీ అప్పగించాలని సీఎస్ ఆదేశించారు. మంచిర్యాల వరంగల్ గ్రీన్ ఫీల్డ్ లైన్ల రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, ఆర్బిట్రేషన్ కింద వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ లు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు చెల్లింపులు చేయాలని సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.


వృద్ధులు తమ ఇబ్బందులను నేరుగా కోర్టుకు తెలుపవచ్చు


- సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గణేష్

సుల్తానాబాద్, ఆగస్టు 21: వృద్ధులు తమ ఇబ్బందలను నేరుగా కోర్టుకు తెలుపవచ్చని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో సీనియర్ సిటిజెన్స్ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పిల్లలు పట్టించుకోని వృద్ధులైన తల్లిదండ్రులు తమకు నేరుగా ఒక దరఖాస్తు ఇస్తే దాన్ని ప్రభుత్వంతో సంప్రదించి పరిష్కరిస్తామన్నారు. వృద్ధులకు రాజ్యాంగం ద్వారా, చట్టాల ద్వారా ఉన్న పలు ప్రయోజనాలు, హక్కులను పలువురు న్యాయవాదులు తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, జోగుల రమేష్, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజం యాదవ్, లక్ష్మీకాంత రెడ్డి, ఆలూరి శ్రీనివాస్‌రావు, వొడ్నాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.











రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21: రైతులను రుణవిముక్తులను చేయడంతో పాటు రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని రుణవిముక్తులను చేసేందుకు వరంగల్ డిక్లరేషన్ సభలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా అధికారంలోకి వచ్చిన కేవలం 8-9 మాసాల్లోనే రైతు రుణమాఫీ చేసి చూపించిందన్నారు. ఇప్పటికే జూలై 18నుంచి ఆగస్టు 15వరకు 18వేల కోట్ల రూపాయలతో రెండు లక్షల లోపు రుణం ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. సాంకేతి కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందు తున్నారని, తమ ఆధార్ కార్డు ద్వారా రుణమాఫీ అర్హత తెలుసుకొని సమ స్యను పరిష్కరించుకోవడం ద్వారా మాఫీ వర్తిస్తుందన్నారు. రెండు లక్షల పైచిలుకు రుణాల్లో కూడా ఆపై మొత్తాన్ని చెల్లించి రెండు లక్షల వరకు రుణం పొందే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏక కాలంలో రూ.1లక్ష రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి రైతు రుణాలను మాఫీ చేయాలనే ఆలోచన లేకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం అంబానీ, అదానీల రుణవిముక్తికి కృషి చేస్తుంది తప్ప రైతు రుణాల మాఫీకి కాదన్నారు. రేషన్‌కార్డు లేని వారికి కూడా అధికారుల విచారణ అనంతరం మాఫీ వర్తిస్తుందని ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అర్హత ఉండి, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని వారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతిపక్షాలు రైతులకు గైడ్‌గా నిలవాలి తప్ప, రెచ్చ గొట్టడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతల్లో చేసిన లక్ష రూపాయల రుణమాఫీ పథకం కేవలం వడ్డీ మాఫీ పథకంగా మారిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ ఎంపీపీ రమేష్‌బాబు, నాయకులు గుంటి జగదీశ్వర్, భాస్కర్‌రావు, షేక్ చాంద్ పాషా, పొగల్ల శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి





గాంధేయ మార్గంలో సామాజిక కార్యకర్త పాదయాత్ర

అభివృద్ధిపై సీఎంను కలిసేందుకు హైదరాబాద్‌కు పయనం

భగత్‌నగర్, ఆగస్టు 21:తమ ప్రాంత అభివృద్ధి పై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకునేందు కు ఓ సామాజిక కార్యకర్త గాంధేయమార్గంలో పాదయాత్ర చేపట్టాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణికి చెందిన పెందోర్ ధర్ము అనే సామాజిక కార్యకర్త గాంధీ వేషధారణతో పాదయాత్రగా బయలుదేరి కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధిపై విన్నవించేందుకు గాంధేయ మార్గంలో పాదయాత్ర చేపట్టినట్లు ధర్ము తెలిపారు.


మహాత్మాగాంధీ వేషధారణలో ధర్ము

పురుగుల మందు తాగి మహిళ మృతి


సరోజన (ఫైల్)


ఇల్లందకుంట, ఆగస్టు 21:మండలంలోని టేకుర్తికి చెందిన శ్రీరాముల సరోజన (58) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజన వారం రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తుంది.ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. సరోజన భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

శంకరపట్నం, ఆగస్టు 21: మండలంలోని అంబాలపూర్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నాటు సార తయారీ స్థావరాలపై బుధవారం దాడి చేశారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ కరీంనగర్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకం ధ్వంసం చేశారు. గొల్లెన కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు..: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: మండల కేంద్రం సమీపంలో కరీంనగర్- వరంగల్ రహదారిపై బుధవారం బైక్‌ను కారు ఢీకొంది. మండలంలోని ఆముదాలపల్లికి చెందిన ఆకునూరి తిరుపతిరెడ్డి బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు పడిపోయాడు. తిరుపతిరెడ్డి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.





టేకుచెట్ల నరికివేతపై డీఎఫ్‌వో విచారణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో టేకు చెట్ల నరికివేతపై విచారణకు వెళ్లిన డీఎఫ్‌వో బాలమణి ఆధ్వర్యంలోని అధికారులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలోని నరికిన చెట్లను అధికారులు పరిశీలించి సోదాలు నిర్వహించారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటిలో నిల్వ చేసిన పాత కలపను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవడంతో రైతులు

పోతిరెడ్డిపల్లిలో అధికారులను అడ్డుకున్న రైతులు

అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామ శివారులోని అటవీ సమీపాన ఉన్న 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 21 మందికి చెందిన పట్టా భూమిలోని టేకు చెట్లను గత యేడాది నరికి వేస్తే ప్రస్తుతం కలపను ఎందుకు స్వాధీన పర్చుకుంటారని అధికారులను నిలదీశారు. సుమారు మూడు గంటల పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఓ వ్యక్తి ఇంటిలో నిల్వచేసిన పురాతన కలపను స్వాధీన పర్చుకుంటామని అటవీశాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కలపను తరలిస్తే ఊరుకోబోమని అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు ఇతర గ్రామం నుంచి వాహనాన్ని తీసుకువచ్చి కలపను సిరిసిల్ల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. అనుమతి లేకుండా టేకు చెట్లను నరికితే చట్టత్యా చర్యలు తప్పవని డీఎఫ్‌వో బాలమణి హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి)/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,067 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.276 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.66 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి 3,200క్యూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: మద్యం మత్తులో గొడవతో కరీంనగర్ అశోక్‌నగర్‌లోని దుర్గమ్మగడ్డ ఉర్దూమీడియం స్కూల్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న భవనం మూడో అంతస్తులో అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్ (32) మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. ముజాయిద్‌ఖాన్‌ను అశోక్‌నగర్‌కు చెందిన మీర్జా సుఫియాన్‌బేగ్ హత్య చేశాడని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. సీఐ, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ముజాయిద్‌ఖాన్‌కు వివాహం జరిగినప్పటికీ భార్య అతడితో కలిసి ఉండడం లేదు. ఆటో నడుపుతూ, పూలు అమ్ముతూ జీవిస్తున్న ముజాయిద్ ఖాన్ ఒంటరిగానే అశోక్‌నగర్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి బంధువుల వద్ద భోజనం చేసిన ముజాయిద్‌ఖాన్ మద్యం సేవించి దుర్గమ్మగడ్డలోని స్కూల్ భవనంపై ఇసుకలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అక్కడే సమీపంలో హోటల్‌లో పని చేస్తున్న మీర్జాసుఫియాన్‌బేగ్ అదే భవనంపైకి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు.



ముజాయిద్‌ఖాన్ (ఫైల్)

మద్యం విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ముజాయిద్ ఖాన్ ముఖంపై సిమెంట్ ఇటుకతో మీర్జా సుఫియాన్‌బేగ్ బాదాడు. తల, ముఖంపై తీవ్ర రక్త గాయాలతో ముజాయిద్ ఖాన్ అక్కడికక్కడే మరణించాడు. అయితే ఈ విషయాన్ని నిందితుడు స్థానికులతో రాత్రి చెప్పాడని, అయినప్పటికీ మద్యం మత్తులో అలాగే మాట్లాడుతాడని భావించారని పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం నిందితుడు తాను ఒకరిని హత్య చేశానని తన తండ్రికి చెప్పగా వెంటనే స్థానికులు భవనంపై చూడగా ముజాయిద్‌ఖాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే పోలీ సులకు సమాచారం అందించారు. సీఐ సరిలాల్ వెంటనే మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచారు. అనంతరం విచారణ జరుపుతు న్నారు. కాగా మృతుడు, నిందితుడు ఇద్దరు కూడా పాత నేరస్థులుగా తెలిసింది. హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మద్యం మత్తులో చిన్న కారణంతో గొడవకు దిగగా హత్యకు దారితీసిందని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సరిలాల్ తెలిపారు.

సైబర్ నేరాల కోసం పాత ఫోన్ల కొనుగోలు

● ముగ్గురు వ్యక్తుల అరెస్టు ● నాలుగు వేల మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్న సైబర్ పోలీసులు



మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలాం, మహ్మద్ ఇష్తికార్

కోల్‌సిటీ, ఆగస్టు 21: సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పని చేయని పాత మొబైల్ ఫోన్లను అక్రమంగా కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం గోదావరిఖని, మేడిపల్లి ఎన్టీపీసీ ఏరియాలో బీహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ సైబర్ నేరాల కోసం పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు ప్రజల నుంచి ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బును ఇచ్చి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ సమాచారం రామగుండం సీసీపీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బందికి అందగా సీసీపీఎస్ ఎస్‌హెచ్‌వో కృష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. బీహార్‌లోని హతియా దియారాకు చెందిన మహ్మద్ షమీమ్(30), అబ్దుల్ సలాం (28), మహ్మద్ ఇష్తికార్(32)ల నుంచి సుమారు 4వేల పాత మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకు న్నట్టు తెలిపారు. రామగుండం, దాని చుట్టు పక్కల ప్రాంతం నుంచి నెల రోజులలో బీహార్‌కు తరలించాలనే ఉద్దేశం తో నిందితులు ప్రజల నుంచి తక్కువ ధరకు పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తున్నారని, అట్టి మొబైల్స్‌ను తమ గ్రామంలో నివసిస్తున్న సహచరుడికి అప్పగిస్తారని విచారణలో వెల్లడైందన్నారు. అసోసియేట్ ద్వారా జార్ఖండ్ రాష్ట్రంలోని జమ్తారా, దియోఘర్ తదితర ప్రాంతాలకు చెందిన సైబర్ నేరస్థులకు ఈ మొబైల్ ఫోన్లు సరఫరా అవుతాయని పేర్కొన్నారు. సైబర్ నేరస్థులకు విక్రయించే ముందు వారి సహచరుడు అక్తర్ ఈ మొబైల్ ఫోన్ల సాఫ్ట్‌వేర్, మదర్ బోర్డు, ఇతర భాగాలను రిపేర్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చేవాడన్నారు. ఈ సైబర్ నేరస్థులు రిపేర్ చేసిన ఫోన్లను ఉపయోగించి మోసపూరితంగా సంపాదించిన డబ్బును అక్తర్, వారు పంచుకుంటారన్నారు. వీరిపై 318(4), 319(2), 61(2) బీఎన్‌ఎస్, 106 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ సెక్షన్ 66(డీ)ఐటీ యాక్ట్-2008 కింద కేసు నమోదు చేసి తెలిపారు.

ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మవద్దు...

ప్రజలు తమ పాత మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మవద్దని, ఇవ్వొద్దని ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సూచించారు. పాత ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తే వాటిని సైబర్ మోసాలకు ఉపయోగించే అవకాశం ఉందని, డివైజ్ ఐడెంటిటీ కారణంగా అమ్మకందారులు కూడా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తున్నారన్నారు. ప్రజలు తమ పాత ఫోన్లను విక్రయించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఒక వేళ అమ్మితే అమ్మకం దారులు కూడా నేరస్తులుగా పరిగణించబడుతారన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు ఉన్న సంచులు

మల్లుపల్లి శివారులో చిరుత కలకలం

అడవి పంది పిల్లలపై దాడి

గంభీరావుపేట ఆగస్టు 21: రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లుపల్లి, గోరంటాల గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి సమీ పాన చిరుత అడవి పంది పిల్లలపై దాడికి తెగబడింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగినట్టు ఫారెస్టు అధికారులు ధ్రువీకరించారు. మల్లుపల్లి గోరంటాల మధ్య ఉన్న బ్రిడ్జి సమీప ప్రాంతంలో అడవిపంది పిల్లలను చిరుత చంపేసింది. ఆ ప్రాంతంలో చిరుత అడుగులతో పాటు చనిపోయిన అడవి పంది పిల్ల ఉండడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దమ్మన్నపేట, గోరంటాల, ముచ్చర్ల అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల వద్ద చిరుత దాడి చేస్తూ మూగజీవాలను చంపేస్తుంది. మండలంలో ఇప్పటికే వరుస సంఘటనలు జరిగి, ఐదుకు పైగా మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. మల్లుపల్లి, గోరంటాల మధ్య చిరుత సంచరిస్తుండడంతో సమీప గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీకి రికార్డు ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో రూ.9.63 కోట్ల రాబడి

భగత్‌నగర్, ఆగస్టు 21: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కరీంనగర్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్. సుచరిత తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల్లో కరీంనగర్ రీజియన్‌కు 9 కోట్ల 63 లక్షల 46 వేల రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల్లో రీజియన్ వ్యాప్తంగా 12,18, 192 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పామన్నారు. మొత్తం 17,09,620 మంది ప్రయాణికుల్లో 12,05, 396 మంది మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారన్నారు. రీజియన్ వ్యాప్తంగా ఆదాయాన్ని ఆర్జించుడంలో సహకరించిన ప్రయాణికులకు రీజినల్ మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత

జ్వరంతో వృద్ధుడి మృతి

గన్నేరువరం, ఆగస్టు 21: మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన పిట్టల రాజనర్సు (72) జ్వరంతో మృతి చెందాడు. రాజనర్సుకు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న డాక్టర్లచే చికిత్స చేయించుకున్నాడు. నాలుగు రోజులు గడిచినా జ్వరం తగ్గక పోవడంతో కుటుంబ సభ్యులు శనివారం రాత్రి కరీంనగర్‌కు తరలించారు. అప్పటికే జ్వర తీవ్రత పెరగగా ఇన్‌ఫెక్షన్ అన్ని అవయవాలకు సోకి మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



రాజనర్సు (ఫైల్)

కార్యదర్శిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 21: మండలంలోని జగ్గసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈర్నపల్లి ప్రశాంత్‌కుమార్ విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి విధులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన బోజ్జ చిన్నయ్య కార్యాలయానికి వచ్చాడు. తమ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కట్టడం లేదని పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగిస్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పోలీసు స్టేషన్‌లో కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఆగస్టు 21: మండలంలోని మాదాపూర్‌లో బాలిక అదృశ్యంపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిప వివరాల ప్రకారం... మాదాపూర్ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోవడంతో తన తల్లి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక మంగళవారం రాత్రి సమయంలో తల్లితో కలిసి ఇంట్లోనే నిద్రించింది. వేకువ జామున నాలుగు గంటల సమయంలో తల్లి నిద్ర నుంచి లేచి చూడగా తన కుమార్తె కనపడక పోవడంతో తమ సమీప బంధువులకు సమాచారం అదించింది. దీంతో బంధువులు పలు గ్రామాల్లో బాలిక కోసం వెతికారు. బాలిక కనపడక పోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఎనుగంటి మూర్తి, అల్లెపు మహేందర్‌తో పాటు మరికొందరు తన కూతురిని అపహరించినట్లు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 21: మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన కనకుంట్ల కార్తీక్ తన భార్య మౌనికతో కలిసి సోమవారం రాఖీ పండగకు అత్తగారి ఊరైన చిన్నకల్వలకు వచ్చాడు. భార్యను వదిలిపెట్టి తిరిగి వేగురుపల్లి వెళ్లిపోయాడు. బుధవారం చిన్నకల్వలకు వచ్చి భార్య ఇంటికి వెళ్దామని చెప్పగా, ఆమె మరుసటి రోజు వెళ్దామని చెప్పింది. దీంతో మనస్థాపానికి గురై పెద్దపల్లి కంచర్‌బావి వద్ద పురుగు మందు తాగాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యభిచార స్థావరంపై దాడి

● ఏడుగురు వ్యక్తులు అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాష్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఆర్ ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 21: జిల్లా కేంద్రంలో జన్మభూమినగర్ ఎల్ఐసీ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఐదుగురు విటులను అరెస్టు చేశారు. ఏసీపీ ఆర్ ప్రకాశ్ తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హమాలీవాడకు చెందిన శ్రీరామోజు కరుణాకర్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడని చెప్పారు. రెండు నెలలుగా వ్యభిచార గృహాన్ని నడిపి స్తున్నారన్నారు. దీని నిర్వాహణ కోసం శాతని శంకర్ అనే వ్యక్తిని మేనేజర్‌గా నియమించుకున్నాడని తెలిపారు. శంకర్ గతంలో పట్టణంలోని ఓ లాడ్జిలో పనిచేశాడని, సోషల్ మీడియాలో అమ్మాయిల ఫొటో లను, వారి నంబర్లను తెలుసుకొని వారిని ఇక్కడికి పిలిపించి వ్యభిచారం కొనసాగిస్తున్నారని అన్నారు. విటుడి వద్ద రూ.2వేలు తీసుకొని సగం మహిళలకు ఇచ్చి సగం నిర్వాహకులు తీసుకుంటున్నారని చెప్పారు.

అందులో భాగంగానే వారం క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ మహిళ ఫొటోను సోషల్ మీడియా ద్వారా సంపాదించి శంకర్ ఆమెకు ఫోన్ చేశారు. ఆమెకు షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశం కల్పిస్తామని, డబ్బులు కూడా పెద్ద మొత్తంలో ఇప్పిస్తామని మంచిర్యాలకు రావాల్సిందిగా చెప్పాడని అన్నారు.. శంకర్ మాట నమ్మి ఆ మహిళ మంగళవారం రాత్రి మంచిర్యాలకు వచ్చి ఆ ఇంటికి వెళ్లిందని ఏసీపీ తెలిపారు. శంకర్ ఆమె ఫొటోను తనకు తెలిసిన మంచిర్యాల, బెల్లంపల్లి, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాల వారికి పంపించాడన్నారు.


సమాచారం తెలుసుకున్న బెల్లంపల్లికి చెందిన కొప్పర్తి నవీన్, దేవ పోశమల్లు, రామకృష్ణాపూర్‌కు చెందిన గండి రమేశ్ హమాలీవాడకు చెందిన కొలిపాక రాజ శేఖర్, సీసీసీ నస్పూర్‌కు చెందిన గొల్లపల్లి శేఖర్‌లు రాత్రి 10 గంటల సమయంలో గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారని అన్నారు. వారు ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున శంకర్‌కు ఇచ్చారని తెలిపారు. శంకర్ వారిని ఆ మహిళకు చూపించి వీరే షార్ట్‌ఫిలిం మేకర్స్ అని పరి చయం చేయించాడని ఏసీపీ చెప్పారు. వీరికి అను కూలంగా ఉంటేనే షార్ట్‌ఫిలింలో అవకాశాలు కల్పి స్తారని శంకర్ చెప్పాడని అన్నారు. అందుకుగాను డబ్బులను కూడా ఇస్తారని ఆమెకు చెప్పగా దీంతో ఆమె అందుకు ఒప్పుకుందన్నారు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ బన్సీలాల్ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారందరిని అదుపులోకి తీసుకున్నారని ఏసీపీ తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లలో ప్రముఖుల నంబర్లు కూడా ఉన్నాయని ఏసీపీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: కొత్తపల్లి మండల పరిధిలోని మార్క్‌ఫెడ్ గోదాం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన కొట్యూరి అజయ్ (33) మృతిచెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. అజయ్ కుటుంబంతో కలిసి చింతకుంటలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనిచేస్తుండేవాడని తెలిపారు. అజయ్ మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సెంట్రింగ్‌పనికి వెళ్ళి తిరిగి చింతకుంటకు తన బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వాగులు పొంగితే రాకపోకలు బంద్

● కల్వర్టులు, వంతెనలు లేక జనాల అవస్థలు ● ప్రతిపాదనల దశ దాటని వైనం



వాగు ప్రవాహంతో నిలిచిపోయిన రాకపోకలు

కథలాపూర్, ఆగస్టు 21: ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల పల్లె వాసులకు రవాణా సదుపాయాలు మెరుగుపడక పోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో నేతలు రోడ్లు, వంతెనల నిర్మాణాలపై ఇస్తున్న హామీలు నెరవేరకపోవడం వారికి పల్లె వాసులపై ఉన్న చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతోంది. ఎన్నో సార్లు తమకు రవాణా మెరుగుపరచాలని విన్న విస్తున్నా నాయకులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండడమే కాకుండా వంతెనలు, కల్వర్టులు లేక ప్రజలు పడుతున్న కష్టాలు దారుణంగా ఉన్నాయి.

తుర్తి, తక్కళ్లపల్లి వాసుల అవస్థలెన్నో...

చందుర్తి, రుద్రంగి, కొడిమ్యాల, బీమారం మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామానికి వెళ్లాలంటే అంబారి పేట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ కల్వర్టు నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుంటే రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోవాల్సి వస్తోంది. సమీప అడవుల్లోంచి నీరు పుష్కలంగా ప్రవహిస్తే రోజుల తరబడి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అదేవిధంగా తక్కళ్ళపల్లి-సిరికొండ వంతెన అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన కారణంగా వాగు పొంగితే కథలాపూర్ వైపు రాకపోకలు నిలిచిపోవాల్సిన దుర్గతి పట్టింది.

ఈ వంతెన పనులను కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించడంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇప్పటికైనా కల్వర్టులు నిర్మించి, వంతెన పూర్తి చేసి తమ అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తక్కళ్లపల్లిలో నుంచి కాలినడకన వస్తున్న యువకులు

తోటి ఖైదీ బెయిల్ ఖర్చుల కోసం చోరీలు..

గోదావరిఖనిలో యువకుడి అరెస్టు



యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: గోదావరిఖని ప్రాంతంలో తాళం వేసి ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లికి చెందిన దురిశెట్టి స్వామి నిరంజన్ (35) గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని మిలీనియం క్వార్టర్స్, టూటౌన్ పరిధిలోని పోతనకాలనీలో దొంగతనాలు చేశాడు. డిగ్రీ పూర్తి చేసిన స్వామి నిరంజన్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ పలుమార్లు జైలుకు వెళ్లాడు. నిందితుడిపై 14 కేసులు ఉన్నాయి.

ఒక కేసులో భద్రాచలం సబ్ జైలులో ఉన్న సమయంలో రవీందర్ అనే తోటి ఖైదీతో పరిచ యం ఏర్పడింది. తన భార్య గర్భిణి అని ఎలా గైనా తనను బయటకు తీసుకు రావాలని స్వామి నిరంజన్‌ను రవీందర్ కోరాడు. రవీందర్‌ను బయటకు తీసుకు వచ్చేందుకు అవసరమైన డబ్బు సమ కూర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని స్వామి నిరంజన్ నిర్ణయించుకున్నాడు. ఈనెల 9న భద్రాచలం నుంచి గోదావరిఖనికి వచ్చి మిలీనియం క్వార్టర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు తులాల వెండి చోరీ చేశాడు. క్వార్టర్ల పార్కింగ్‌లో బైక్‌ను తీసుకుని కొత్తగూడెంకు వెళ్లాడు. వరంగల్ శివారులో బండిలో పెట్రోల్ అయిపోవడంతో అక్కడే వదిలి బస్సులో భద్రాచలం చేరుకున్నాడు. చోరీ చేసిన నగలను కొత్తగూడెంలోని ఫైనాన్స్‌లో కుదువపెట్టి వచ్చిన డబ్బులతో లాయర్‌ను మాట్లాడి రవీందర్‌కు బెయిల్ వచ్చేలా ఏర్పాట్లు చేశాడు. చోరీ చేసిన డబ్బులు అయిపోవడం, మళ్లీ డబ్బులు అవసరం పడడంతో స్వామి నిరంజన్ మళ్లీ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 14న పోతనకాలనీలో సింగరేణి క్వార్టర్‌లలో రెక్కీ నిర్వహించి, చాలా క్వార్టర్‌లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించాడు.

అర్ధరాత్రి 12 గంటలకు ఒక క్వార్టర్ తాళం పగులగొట్టి రూ.5500 నగదు, మరో క్వార్టర్‌లో ఎనిమిది తులాల వెండితో పాటు ఫాస్ట్ ట్రాక్‌వాచ్, బ్లూటూత్ హెడ్‌సెట్ చోరీ చేశాడు. క్వార్టర్స్ పార్కింగ్ స్థలంలో ఉన్న బైక్‌ను చోరీ చేసి కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చుంద్రుగొండ వద్ద బైక్ పాడవడంతో అక్కడే వదిలి పారిపోయాడు. తిరిగి చోరీ చేయడానికి బుధవారం పోతనకాలనీకి వచ్చిన స్వామినిరంజన్ పోలీసులకు పట్టుబడ్డాడు. టూటౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై అటువైపు వచ్చిన స్వామి నిరంజన్ పోలీసులను చూసి తప్పించుకోబోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో చోరీ కేసును తక్కువ సమయంలో ఛేదించి, చోరీలకు పాల్పడిన స్వామినిరం జన్‌ను పట్టుకున్న ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ రమేష్, భార్గవ్, ప్రవీణ్, వెంకటేష్‌లను సీఐ అభినందించారు.

సంక్షిప్త సమాచారం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 : బూత్ లెవెల్ ఆఫీసర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు నమోదు చేపట్టాలని పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ ఆఫీసర్‌లతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి 18ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని, చనిపోయిన వారి పేర్లు తొలగించాలని, సెప్టెంబరు 9లోపు ఓటర్ సర్వే పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి సమకూర్చిన క్యారేజీ టిఫిన్ బాక్సులను పెద్దపల్లి నియోజకవర్గ నాయకులు పిల్లలకు అందజేశారు. నల్లవెల్లి శంకర్, వడ్లకొండ మహేష్, ఇగురం కుమార స్వామి, కందుల శ్రీనివాస్, కాల్వల శ్రీనువాస్‌రెడ్డి, పల్లెర్ల అజయ్, అంజి తదితరులు ఉన్నారు.

కళ్యాణ్‌నగర్ : గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన నిరుపేద స్వర్ణకారుడు సిరికొండ వెంకటేశ్వర్లు కూతురు పెళ్లి చేయడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కొండపర్తి నరహరి ఆధ్వర్యంలో రూ.54,230తో పాటు 50కిలోల బియ్యం, పుస్తెమట్టెలు, పెళ్లి చీరను అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కట్ట నగేష్, శ్రీధరాచారి, జగన్, రమేష్, రాజు, శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని కల్వచర్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు గైడ్ టీచర్ గసిగంటి దేవేందర్ చొరవతో పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : రైతులకు ఫర్టిలైజర్ షాపుల యజమానులు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. బదిలీపై మండలానికి వచ్చిన ఏవోను బుధవారం ఫర్టిలైజర్ షాపుల యాజమానులు సత్కరించారు. అధ్యక్షుడు కోలేటి రామన్న,వైస్ ప్రెసిడెంట్ ఆకుల సదయ్య, నాగారం కాశెట్టి, శ్యామ్, పాదం శ్రీనివాస్, ఓలేటి అన్షుమ్, మాదాసు మహేష్, ఆకుల హరీష్, కుందారపు శంకర్ తదితరులు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని వెన్నంపల్లి గ్రామశివారులో విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతిచెందింది. బుధవారం గ్రామానికి చెందిన రైతు బండి రమేష్ ఓ రైతుకు చెందిన పత్తి చేనులో ఎడ్లతో గుంటుక కొడుతుండగా పత్తిలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు ఎద్దు తగిలి విద్యుత్ ప్రసరించి అక్కడికక్కడే ఎద్దు మృతిచెందింది. గుంటుక కొడుతున్న బండి రమేష్ విద్యుత్ షాక్ ప్రమాదం నుంచి బయటపడి ప్రాణాలతో బయటపడ్డాడు. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు రమేష్ తెలిపారు.

కమాన్‌పూర్ : కమాన్‌పూర్ ఎంపీడీవోగా జై లలిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన మునుగంటి సురేష్‌ను ముత్తారం మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లగా అక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న లలితను మండలానికి డిప్యూటేషన్‌పై వచ్చారు.

ముత్తారం : ముత్తారం ఎంపీడీవోగా ఎం సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కమాన్‌పూర్ ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చారు. మండల పరిషత్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

కోల్‌సిటీటౌన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో ప్రధానచౌరస్తాలో ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. జాతీయ మాలమహానాడు రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు మాలెం మధు, పిట్టల వెంకటేష్, నంది నాగేశ్వరరావు, లింగమూర్తి, నూకాల మొండయ్య, దాసరి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంచి వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన అధికారులకు బెస్ట్ పర్ఫార్మన్స్ ఆఫ్‌ది మంత్ పేరిట జ్ఞాపికలను అందచేస్తున్నామని ఒక ప్రకటనలో పెద్దపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ తెలిపారు.

రామగుండంలో రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు

- జెన్‌కో స్థలంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం - మంత్రి శ్రీధర్‌బాబు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, ఆగస్టు 21: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా త్వరలో రామగుండంలో రూరల్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. టీయూఎఫ్ఐడీసీ రూ.29.5కోట్ల నిధులతో రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వీధి దీపాల అభివృద్ధి పనుల్లో భాగంగా కళ్యాణ్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ మాసంలో రూరల్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటుచేసి అందులో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. లక్ష్మీనగర్ కూడలి అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నాడని, రామగుండానికి రూ.100 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఒప్పించి తీసుకువచ్చాడన్నారు. ఏజెన్సీ ద్వారా పనులను వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, లక్ష్మీనగర్‌లో విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వీటి విషయంలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఆషామాషీగా తీసుకోవద్దని హెచ్చరించారు. గజిబిజీగా ఉన్న విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించాలని ఇంజనీర్లకు సూచించారు. లక్ష్మీనగర్‌లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా స్మార్ట్ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. రామగుండంలోని 63.5 బీథర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణ రామగుండానికి భారీగా నిధులు తీసుకురావడానికి కృషి చేయాలని, కేంద్రాన్ని ఒప్పించి ఇక్కడ ఎక్కువ నిధులు వచ్చేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా చచ్చిపోయిందని, బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గిందని, రైతులకు ఎన్నికల ముందు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామి ఇచ్చిందని, రుణ మాఫీ రైతులందరికి వర్తించేలా చర్యలు చేపట్టినట్టు, ఎవరూ కూడా అధైర్యపడవద్దని, అందరికి రుణమాఫీ జరుగుతుందని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రామగుండంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి రామగుండానికి రూ.100కోట్ల నిధులు మంజూరు చేయించానని, రూ.30కోట్లతో వాణిజ్య, వాపార కూడళ్ల అభివృద్ధికి మొదటగా శ్రీకారం చుట్టినట్టు, మంత్రి శ్రీధర్‌బాబు ప్రోత్సాహంతో రూ.100కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇక్కడ వ్యాపారాలు ఇతర చోట్లకు తరలివెళుతున్నాయన్నారు. రామగుండానికి పూర్వవైభవం తీసుకురావడానికి రూ.2.5కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్, రూ.100కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, స్మశాన వాటికల అభివృద్ధి, క్రీడామైదాన అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో పెద్దపల్లి జిల్లా అభివృద్ధి బాటలో నడుస్తుందని, కేంద్రం నుంచి వచ్చే నిధులకు తాను సహాయ సహకారాలు అందిస్తానని, జిల్లాకు రావాల్సిన నిధులపై దృష్టి సారించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, బాల రాజ్‌కుమార్, గణముక్కుల మహాలక్ష్మి, పొన్నం విద్య, దుబాసి లలిత, ధరణి స్వరూప, అడ్డాల స్వరూప, ఎండీ ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, సింహాచలం, చుక్కల శ్రీనివాస్, కందుల సతీష్, దూళికట్ట సతీష్, బండి రాము, పీక అరుణ్, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 21: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు క్రీడాపోటీలు జరుగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు బాలబాలికలకు నిర్వహించడం జరుగుతుంది. ఆరు నుంచి పదవ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. బుధవారం బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. ఆయా పాఠశాలల పీఈటీలు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మూడు రోజులు జరగనున్నట్టు ఎంఎన్‌వో ఎస్ మహేష్ తెలిపారు. మొదటిరోజు బాలికలకు రెండవ రోజు బాలురకు, మూడవరోజు బాలబాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు ఎంఎన్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహేష్

బాధిత కుటుంబాలకు మంత్రి, విప్ పరామర్శ

మంథనిరూరల్, ఆగస్టు 21: పట్టణంలోని, మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పరామర్శించారు. పట్టణంలో మహావాది సరోజన ఇటీవల మృతిచెందగా వారి కుమారులు మహావాది సుధీర్, సతీష్, విజయ్‌లను మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. దొంతులవాడలో ఇటీవల మృతిచెందిన దొంతుల రాజ లింగయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని గుమ్నూనూరు తాజా మాజీ సర్పంచ్ బండెల రామస్వామి మృతి చెందగా లక్ష్మీపురంలోని ఆయన ఇంటి వద్ద పార్థివ దేహానికి నివాళులర్పించారు. వెంకటాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ అక్కపాక సమ్మయ్య, చిట్యాల శంకర్‌లు ఇటీవల ఆనారోగ్య కారణాలతో మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు శశిభూషన్‌కాచే, ఐలి ప్రసాద్, ఇనుముల సతీష్, వొడ్నాల శ్రీనివాస్, పోలు శివ, ఆరెల్లి కిరణ్, హన్మంతు, మంథని సురేష్‌లు ఉన్నారు.

రామగిరి: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య తల్లి మల్లక్క ఇటీవల మృతిచెందగా బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీలు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కళ్యాణ్‌నగర్ : గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బుధవారం పరామర్శించారు. రామగిరి మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్కకొమురయ్య తండ్రి వెంకటి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతగా అతన్ని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని శ్రీధర్‌బాబు వైద్యులకు సూచించారు. అలాగే చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించారు.

ధర్మారం : మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన నందిమేడారం మాజీ సింగిల్‌విండో చైర్మన్ పూస్కూరి నర్సింగారావు భార్య భారతి మంగళవారం మృతిచెందగా బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

షీటీంపై అవగాహన సదస్సు

రామగిరి, ఆగస్టు 21: మండలంలోని పన్నూరు గ్రామంలో రామగుండం డీసీపీ(అడ్మిన్) రాజు ఆదేశాల మేరకు బుధవారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యురాలు స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసంప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700లకు ఫోన్ చేసి సమస్యను తెలపాలని సూచించారు. అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నారని అలాంటి వాటిక దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సిబ్బంది సురేష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 : మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన వడుకాపురం కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం ఆవిడాలపల్లి గ్రామానికి చెందిన చంద్రమౌళి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. వారి వెంట సతీష్, గ్రామస్థులు ఉన్నారు.

అర్హులైన పేదలకు త్వరలో ఇళ్ల పట్టాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఆగస్టు 21: నిరుపేదలైన అర్హులకు త్వరలోనే ఇళ్ల పట్టాలను ఇవ్వనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ హామీ ఇచ్చారు. గంగానగర్, ఎన్‌టీపీసీల్లో ఇళ్లు కోల్పోయిన వారు బుధవారం రామగుండం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను కలవగా వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు అధైర్య పడవద్దని సెప్టెంబర్ మొదటి వారంలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాధితులకు ఒకే చోట ఇండ్ల స్థలాలు ఇప్పించి లే అవుట్‌గా మారుస్తానని, మంచినీరు, కరెంటు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

గౌడ కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సభ్యుడిని సన్మానిస్తున్న నర్సాగౌడ్

ఓదెల, ఆగస్టు 21: గౌడ కులస్థులు కల్లుగీత వృత్తి రక్షణతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు నర్సాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి క్షేత్రం సమీపంలో బుధవారం గౌడ హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నర్సగౌడ్ మాట్లాడుతూ మోకు దెబ్బ ఆధ్వర్యంలో 28 ఏళ్ల పాటు వాటా కోసం పోరాడుతున్నామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పోటీ చేయాలని కోరారు. అనంతరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సాగౌడ్‌ను సన్మానించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జిగా పచ్చిమట్ల శ్రీనివాస్, యువజన సంఘం విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మార్క సతీష్‌లను నియమించారు. మార్క సదానందం, శ్రీపతి శ్రీనివాస్, మార్క రమేష్, నల్లగొని అనిల్, మాచర్ల కొమరయ్య, మల్యాల శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, ఆగస్టు 21: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్రెపల్లిలోని యునాని ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురు వృద్ధులు హాజరై చికిత్సలు పొందారు. వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో యూనాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మారుతి, డీపీఎం సముద్రాల విద్యాసాగర్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, కార్యదర్శి లచ్చయ్య, మహ్మద్ మునీర్, ఏఎన్ఎం జమున, స్వరూప, ఆశాలు ఎల్లమ్మ, స్వప్న, లచ్చయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌కు ఘన నివాళి

సుల్తానాబాద్, ఆగస్టు 21: కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సుల్తానాబాద్‌లో శ్రీవాణి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు క్యాండిల్స్‌తో నిరసన తెలిపారు. బుధవారం శ్రీవాణి డిగ్రీ కళాశాలలో జరిగన కార్యక్రమంలో వారు బాధితురాలికి సంఘీభావం తెలుపుతూ మెడికో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాండిల్స్ వెలిగించి మౌనర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండారు కమలాకర్, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

'దళిత మహిళకు న్యాయం చేయాలి'

కోల్‌సిటీటౌన్, ఆగస్టు21: పోరాటాలకు తామే ఐకాన్ అని చెప్పుకొనే ఎర్ర జెండా పార్టీలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఏమయ్యాయని, ఒక దళిత మహిళకు అన్యాయం జరిగితే సీపీఎం, సీపీఐ, ఇతర విప్లవపార్టీలు, మహిళా సంఘాలు అమ్ముడుపోయినట్టు మౌనంగా వ్యవహరిస్తున్నాయని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికైనా స్వప్న విషయంలో స్పందించి దళిత సింగరేణి కార్మికురాలికి అండగా నిలబడాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి వాటి కట్టడిలో భాగస్వాములు కావాలని టూటౌన్ సీఐ ప్రసాదరావు అన్నారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా బుధవారం శాంతినికేతన్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల దశలోనే కొందరు విద్యార్థులు గంజాయికి బానిస కావడం బాధాకరమైన విషయమన్నారు.ఎవరైనా గంజాయి వాడినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్య క్రమంలో హెచ్ఎం పాపిరెడ్డి, సిబ్బంది కృష్ణారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ముత్తారం : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిరోధంపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జీఎల్ఎన్ రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, రాజేశం, ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ అశోక్, హోంగార్డు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేత్రదానం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 21: గోదావరిఖని జీఎంకాలనీకి చెందిన మల్లుబాయ్ అలియాస్ శకుంతల(61) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేయడం జరిగింది. బుధవారం గంగానగర్‌లో సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కెఎస్‌వాసు, రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం అభినందన పత్రాన్ని అందజేశారు.

విద్యార్థికి సన్మానం

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎండీ.ఆల్‌రిషన్ ఆగస్టు 15న ఢిల్లీ ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని తిరిగి వచ్చాడు. బుధవారం అతడిని ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, సిఆర్‌పి తిరుపతి, ఉపాధ్యాయులు సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఓదెల, ఆగస్టు 21 : మండలంలోని పొత్కపల్లిలో బుధవారం ఎంపీటీసీ గ్రాంట్ రూ.2.11 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ రెడ్డి స్వరూప, మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి రామినేని కుమార్ పాల్గొన్నారు.

కొలనూర్‌లో హోంగార్డు దారుణ హత్య

ఓదెల, ఆగస్టు 21 : మండలంలోని కొలనూర్‌లో బుధవారం అర్ధరాత్రి మాటూరి విజయ్(40) అనే హోంగార్డు దారుణ హత్యకు గురయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన విజయ్ 20 ఏళ్ల క్రితం కరాటే మాస్టర్‌గా కొనసాగిన అనంతరం అప్పటి ఎస్పీ ప్రవీణ్ కుమార్ ప్రోత్సాహంతో పోలీస్ శాఖలో హోంగార్డు చేరాడు. బుధవారం రాత్రి కొలనూర్‌కు వచ్చిన సందర్భంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దారుణంగా పొడిచి చంపినట్లు తెలిసింది. కొలనూర్ హైస్కూల్ వెళ్లే దారిలో రోడ్డుపై ఈ హత్య జరిగింది. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



పదోన్నతులు కల్పించాలని వినతి

గోదావరిఖని, ఆగస్టు 21: సింగరేణిలో పని చేస్తున్న కెమిస్ట్రీలకు పదోన్నతులు కల్పించాలని సీఎండీ బలరాంనాయక్‌కు క్వాలిటీ విభాగంలో పని చేస్తున్న కెమిస్ట్రీలు, టెక్నికల్ ఇన్‌స్పెక్టర్లు గూళ్ల మల్లికార్జున్, చెల్పూరి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఏ గ్రేడ్ ప్రమోషన్లు 12వరకు ఉండేవని, వాటిని తగ్గించారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని, బీ గ్రేడ్‌లో 5సంవత్సరాలు పూర్తిచేసిన వారికి జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ పరీక్షకు అనుమతించాలని, పెండింగ్‌లో ఉన్న 16జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ ఉద్యోగాలను ఇంటర్నల్ ద్వారా భర్తీచేయాలని కోరారు. అదేవిధంగా కెమిస్ట్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నర్సింహారెడ్డి, రాజేందర్, శ్రీధర్, తిరుపతి ఉన్నారు.

'గెలిచిన సంఘాలు కార్మికులను మోసం చేస్తున్నాయి'

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన రెండు సంఘాలు కార్మికులను మోసం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గెలిచిన సంఘాలు అధికారిక సమావేశాలకు హాజరవుతూ పైరవీలకు పరిమితమై కార్మికుల సమస్యలను గాలికి వదిలేసినట్టు విమర్శించారు. గనుల వేలం విషయంలో రెండు సంఘాలు చిత్తశుద్ధి లేని విధంగా వ్యవహరించాయని, కార్మికుల్లో రెండు సంఘాల వైఖరిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్టు ముత్యంరావు పేర్కొన్నారు. అనంతరం ఏరియా సెక్రెటరీ కుంట ప్రవీణ్ మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం గానీ గెలిచిన సంఘాలు గానీ ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. హామీల అమలు ఏదశలో ఉన్నాయో కార్మికులకు చెప్పాల్సిన బాధ్యత రెండు సంఘాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు. గెలిచిన తర్వాత హామీల అమలును పక్కన పెట్టడం కార్మికుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. యాజమాన్యం జారీ చేసే సర్క్యులర్లు తమ కృషి ఫలితమని గొప్పలు చెప్పుకోవడానికే రెండు సంఘాలు పరిమితం కావడం సిగ్గుచేటైన విషయమని అన్నారు. కార్మికులను మభ్య పెట్టే చర్యలు మానుకొని అమలు చేసే దిశగా గెలిచిన సంఘాలు ప్రయత్నం చేయాలని సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హామీల అమలులో ఏయూనియన్‌కైనా సీఐటీయూ పూర్తి సహకారాన్ని అందిస్తుందని, ఎవరు పరిష్కరిస్తారనేది సమస్య కాదని, కార్మికులకు మేలు జరగాలనేది సీఐటీయూ భావన అని ప్రవీణ్ పేర్కొన్నారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సీఐటీయూ ఆందోళనలు చేస్తుందని అన్నారు. ఈగేట్‌మీటింగ్‌లో ఎస్ వెంకన్న, శ్రవణ్, కిషోర్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి సింగరేణీయుడు మొక్కలు నాటాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: ప్రతి సింగరేణి విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని సంస్థ సీఎండీ ఎన్ బలరాం అన్నారు. బుధవారం పోతనకాలనీలో వనమహోత్సవ కార్యక్రమ ప్రారంభోత్సవానికి సీఎండీ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. ఈసందర్భంగా సీఎండీ మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా లక్ష మొక్కలను నాటాలని సంకల్పంతో వనమహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు పేర్కొన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం అధిక ఉష్ణోగ్రతలకు పెట్టిందిపేరని, ఉష్ణ తాపాన్ని తగ్గించేలా ఎక్కడ ఖాళీ స్థలాలు ఉంటే అక్కడ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు పెంచడం ఉద్యమంలా సాగాలని అభిప్రాయపడ్డారు. ఆర్జీ-2 ఏరియాలో 5,500 మొక్కలను నాటనున్నట్టు సీఎండీ తెలిపారు. ఈ వన మక్షత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, జీఎం సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు మధుసూదన్, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వర్‌రావుతో పాటు అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

800మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కృషి

- ఉద్యోగుల పిల్లల కోసం సాంకేతిక శిక్షణ కేంద్రాలు - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సైట్ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గోదావరిఖని, ఆగస్టు 21: సింగరేణి సంస్థ ద్వారా 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని రామగుండం ప్రాంతంలో త్వరలో ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం ఆర్జీ-1 జీడీకే ఓసీపీ-5లో సైట్ ఆఫీస్ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, కార్మికుల అవసరాలు తీర్చడంలో కూడా బాగా పని చేస్తున్నారని శ్రీధర్‌బాబు కితాబిచ్చారు. ఇందులో భాగంగానే ఓసీపీ-5 ఉద్యోగుల సంక్షేమం కోసం అన్నీ హంగులతో సైట్ ఆఫీస్‌ను ఆధునికీకరించుకుని ప్రారంభించామన్నారు. సింగరేణి కార్మికుల, ఉద్యోగుల పిల్లల కోసం సాంకేతిక శిక్షణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. సింగరేణి నుంచి సీఎంఓఏఐ నాయకులు పొనగోటి శ్రీనివాస్, సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్(పా, ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్, నర్సింహులు, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- సింగరేణి వన మహోత్సవంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 21: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. ఆర్జీ-1 పరిధిలో బుధవారం మేడిపల్లి ఓసీపీ వద్ద సింగరేని ఆధ్వర్యంలో నిర్వహించిన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై భారీగామొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రామగుండంలో కాలుష్యం రోజు రోజుకు పెరిగిపోతుందని, సింగరేణి యాజమాన్యం ఓసీపీ డంప్‌లపైన విరివిగా మొక్కలను నాటి కాలుష్యాన్ని నివారించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని, మేడిపల్లి ఓసీపీతో లింగాపూర్, మేడిపల్లి గ్రామస్థులు ఎంతో మంది నష్టపోయారని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాలు కల్పిచాలని, లింగాపూర్ గ్రామస్థులకు అతి సమీపంలో డంప్ యార్డు ఉండడం వల్ల వర్షానికి దుర్వాసన వెదజల్లుతుందని, డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పేలుళ్లతో మేడిపల్లి గ్రామంలో చాలా ఇండ్లు బీటలు వారిని వర్షానికి నాని కూలిపోయే స్థాయికి చేరుకు న్నాయని, ప్రాణ నష్టం జరుగకుండా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి లాభాల వాటా చెల్లింపుపై ముఖ్య మంత్రి తీసుకెళతానని చెప్పారు. సింగరేణి యాజమాన్యం పెద్ద ఎత్తున మొక్కలు నాటడం పట్ల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, వాటి సంరక్షణను కూడా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్ మాట్లాడు తూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ మొక్కలను నాటుతున్నామని, ఆర్జీ-1 ఏరియాలో 1990 నుంచి 2023 వరకు 1563హెక్టార్లలో 25లక్షల మొక్కలను నాటడం జరిగిందని, 2024లో 119హెక్టార్లలో 2.51లక్షల మొక్కలన నాటడం జరిగిందని, 225 మర్రి, రావి, మామిడి, ఎర్ర చందనం వృక్షాలను ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా నర్సరీలో పెంచడం జరుగుతుందన్నారు. రాజీవ్ రహదారి వెంట 24కిలోమీటర్ల మేర మొక్కలను నాటించి వాటిని పరిరక్షిస్తున్నట్టు చెప్పారు. ఎన్‌సీఆర్‌ఏపీ పనుల్లో భాగంగా రూ.2.77కోట్ల నిధులు వెచ్చించి సుందిళ్ల, జనగామ, ముస్త్యాల గ్రామాల్లో అభివృద్ధి పనులను చేయడం జరిగిందని, ఇందులో భాగంగా 397 సోలార్ లైట్లు, ప్రభావిత గ్రామాలకు ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామగుండం సీపీ శ్రీనివాస్, మేయర్ బంగి అనీల్‌కుమార్, డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్, డీఎఫ్ఓ శివయ్య, గుర్తిం పు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, సీఎంఓఏ నర్సింహులు, సేవా సమితి అధ్యక్షురాలు అనిత, సేఫ్టీ అధికారి భైద్య, అధికారులు రాంమోహన్, కిరణ్‌బాబు, వివిధ విభా గాల అధికారులు పాల్గొన్నారు.



సీఎండీతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్